క్లుప్తంగా

సొసైటీ అభివృద్ధికి సహకరించాలి

ఉదయగిరి: కొట్టాలపల్లి సొసైటీ అభివృద్ధికి రైతులు సహకరించాలని సొసైటీ చైర్మన్ గడ్డం వెంకటస్వామయ్య కోరారు. కొట్టాలపల్లి సహకార సొసైటీలో సోమవారం నిర్వహించిన సర్వజన మహాసభలో ఆయన మాట్లాడారు.రైతులు మొండి బకాయిలను చెల్లించి ఇతరులకు రుణాలను అందించేందుకు సహకరించాలని కోరారు. పర్సన్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులురెడ్డి, మేనేజర్ రాజశేఖర్, సీఈఓ పోలయ్య, డైరెక్టర్లు రాజా, నరసింహారావు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన

ఉదయగిరి రూరల్: రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎల్ రామ్మోహన్ అన్నారు. జీ చెర్లోపల్లిలో పౌర హక్కుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కులం, మతం, వర్గం అనే తారతమ్య భేదాలు లేకుండా దేశ ప్రజలందరికీ సమాన హక్కులను రాజ్యాంగం కల్పించిందన్నారు. పౌరహక్కులకు ఎలాంటి భంగం కలిగిన చట్టం ద్వారా రక్షణ పొందవచ్చని తెలిపారు. అనంతరం ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను తీసుకుని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీడీఓ బీ శ్రీనివాసులు, ఎంఈఓ టీ శ్రీనివాసులు, ఏఎస్‌డబ్ల్యూఓ రమణారెడ్డి, ఏఈలు శ్రీనివాసరాజు, జగన్నాథం, ఎస్సై ఇంద్రసేనారెడ్డి, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు కే రఘు, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యావనరుల కేంద్రానికి పాఠ్యపుస్తకాలు

ఉదయగిరి రూరల్: మండల విద్యా వనరుల కేంద్రానికి పాఠ్య పుస్తకాలు సోమవారం చేరాయి. వాటిని ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు పరిశీలించారు. జిల్లా కేంద్రం నుంచి రెండో విడతగా 9,530 పాఠ్య పుస్తకాలు వచ్చాయని, దసరా సెలవుల తరువాత పాఠశాలలకు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

వీఆర్వోకు సన్మానం



సంగం: సంగం-1 వీఆర్వోగా పనిచేస్తున్న మోహన్‌రావు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో దంపతులను తహసీల్దార్ సోమ్లానాయక్ ఘనంగా సన్మానించారు. డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జ్వాలాముఖి ఆలయానికి రూ.లక్ష విరాళం



ఆత్మకూరురూరల్: పట్టణంలోని జ్వాలాముఖి అమ్మవారు ఆలయానికి కొలగాని సుబ్రహ్మణ్యం, అమ్మణ్ణమ్మ జ్ఞాపకార్థంగా అల్లుళ్లు, కుమార్తెలు సుసర్ల నాగరాజు, సునందలక్ష్మి, చలంచర్ల శ్రీనివాసరావు, సునీత దంపతులు రూ.లక్ష విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ ట్రస్టు సభ్యులు శాలువాలతో సత్కరించారు.

జూదరుల అరెస్ట్

మర్రిపాడు: మండలంలోని బాట గ్రామంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్సై శ్రీనివాసరావు సోమవారం దాడులు నిర్వహించారు. 9 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి, రూ.4600 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.335

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.335 లభించింది. వేలానికి 1290 బేళ్లు రాగా, అందులో 1072 బేళ్లను కొనుగోలు చేసినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.335, కనిష్టంగా రూ.80, సగటున రూ.253.32 ధర పలికిందని వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

చిరువ్యాపారుల సంక్షేమానికి చర్యలు

ఆత్మకూరురూరల్: కేంద్ర ప్రభుత్వం చిరువ్యాపారుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటోందని మున్సిపల్ చైర్మన్ జీవీ రమణమ్మ, కమిషనర్ గంగా ప్రసాద్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన లోక్‌కళ్యాణ్ మేళాలో వారు మాట్లాడారు. చిరువ్యాపారులు, పేదలకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మెప్మా అధికారిణి మాధవి మాట్లాడుతూ ప్రభుత్వం బ్యాంకుల నుంచి సిబిల్ స్కోర్‌తో పనిలేకుండా వీధి వ్యాపారులు, పేదలకు రుణాలు మంజూరు చేయిస్తుందన్నారు. వీధి వ్యాపారులు రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు.

వైద్యుల సమ్మె బాట

- పీహెచ్‌సీల్లో నిలిచిన ఓపీ సేవలు
- ఇబ్బందులు పడిన రోగులు



వైద్యుల సమ్మెతో ఏఎస్‌పేట పీహెచ్‌సీలో ఓపీకి అరకొరగా వచ్చిన రోగులు

ఉదయగిరి రూరల్: పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు సమ్మె బాట పట్టారు. తమ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించకపోవడంతో వైద్యులు సోమవారం ఓపీ సేవలను నిలిపివేశారు. అత్యవసర కేసులను మాత్రమే చూశారు. ఓపీ సేవలు అందకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఇద్దరు వైద్యాధికారులు సమ్మెలో పాల్గొన్నారు. దీంతో రెండో ఏఎన్‌ఎం బీపీ, జ్వరం, జలుబు, తదితర చిన్న అనారోగ్య సమస్యలతో వచ్చిన వారికి మందులు ఇచ్చి పంపించారు. నిత్యం పీహెచ్‌సీకి 50 నుంచి 70 మంది వరకు రోగులు వస్తుండగా, వైద్యుల సమ్మెతో 25 మంది మాత్రమే వచ్చారు.

అనుమసముద్రంపేట: మండలంలోని చిరమన, ఏఎస్‌పేట పీహెచ్‌సీల వైద్యులు ఓపీ విధులను బహిష్కరించారు. దీంతో రోగులకు స్టాఫ్ నర్సులే వైద్యసేవలు అందించారు. వైద్యులు లేరని తెలియక వచ్చిన రోగులు వెనక్కి వెళ్లలేక స్టాఫ్ నర్సుల వద్దే వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకుని వెళ్లారు. ఏఎస్‌పేట పీహెచ్‌సీకి నిత్యం 70 నుంచి 90 మంది వరకు రోగులు వస్తుంటారు. వైద్యుల సమ్మెతో పీహెచ్‌సీ రోగులు రాక వెలవెలబోయింది.

కలిగిరి: కలిగిరి పీహెచ్‌సీలోని ఇద్దరు వైద్యాధికారులు విధులు బహిష్కరించడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. సోమవారం పీహెచ్‌సీకి 72 మంది రోగులు వచ్చారు. వైద్యులు లేకపోవడంతో వైద్యసిబ్బంది వద్ద పరీక్షలు చేయించుకుని వారిచ్చిన మందులను తీసుకుని వెనుతిరిగారు.

దగదర్తి: వైద్యుల సమ్మెతో దగదర్తి, తురిమెర్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ సేవలు నిలిచిపోయాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దగదర్తి, తురిమెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న నలుగురు వైద్యులు ఓపీ సేవలను నిలిపివేసి అత్యవసర వైద్య సేవలు మాత్రమే అందించారు. దీంతో నర్సులు, ఫార్మసిస్టులు రోగులకు మందులు అందజేసి పంపించారు.

సంగం: స్థానిక రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో జూనియర్ డాక్టర్లే వైద్యసేవలు అందించారు. వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనివాసులరెడ్డి డిప్యుటేషన్‌పై ఉన్నారు. మరో వైద్యుడు అశోక్ స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో ఆరుగు జూనియర్ డాక్టర్లు 43 మంది రోగులకు సేవలు అందించాల్సి వచ్చింది. తీవ్రంగా గాయపడిన అశ్విత్ అనే చిన్నారికి సైతం జూనియర్ డాక్టర్ వైద్యం అందిస్తూ కనిపించాడు.



సంగంలో గాయపడిన చిన్నారికి వైద్యం అందిస్తున్న జూనియర్ డాక్టర్



కలిగిరిలో రోగులకు సేవలు అందిస్తున్న స్టాఫ్‌నర్సు

సరస్వతీ నమస్తుభ్యం



ఉదయగిరి శివాలయంలో సరస్వతీదేవిగా పార్వతీదేవి



కలిగిరి: కాత్యాయనీగా భద్రకాళి



వరికుంటపాడు: మహాగౌరిగా మానసాదేవి



సంగంలో సరస్వతీదేవిగా గంగమ్మ



ఆత్మకూరులోని విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో..

ఆత్మకూరురూరల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. 8వరోజు సోమవారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూలానక్షత్రం సందర్భంగా పట్టణంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు బ్రహ్మశ్రీ మేళ్లచెరువు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో శ్రీదేవి పీఠార్చన పూర్వక సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. శ్రీలలితా చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. సరస్వతీదేవి అలంకారంలోని అమ్మవారిని విద్యార్థులు దర్శించుకుని పుస్తకాలు, పెన్నులను అమ్మవారి వద్ద ఉంచి పూజలు చేశారు. అలాగే కాశీనాయన ఆశ్రమంలో అన్నపూర్ణాదేవి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులను అనుగ్రహించారు.

సంగం: స్థానిక గంగమ్మ ఆలయంలో సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. దూదితో అలంకరించిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే సంగమేశ్వరస్వామి ఆలయంలో కామాక్షిదేవి అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అల్లూరు: మండలంలోని నార్త్‌మోపూరులోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కావలి(అల్లూరు): పట్టణంలోని పాతూరు శివాలయంలో అమ్మవారు మాతంగీశ్వరీదేవిగా దర్శనమిచ్చారు.

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్లలోని మానసాదేవి ఆలయంలో మహాగౌరీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు.

కలిగిరి: స్థానిక భద్రకాళి ఆలయంలో కాత్యాయినీ దేవిగా అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

ఉదయగిరి: పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయం, సంతానలక్ష్మి ఆలయం, గండిపాళెంలోని నాగరప్పమ్మ ఆలయాల్లో అమ్మవార్లు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



కాశీనాయన ఆశ్రమంలో సరస్వతి అలంకారం



కావలి శివాలయంలో మాతంగీశ్వరీదేవి అలంకారం



అల్లూరు: నార్త్‌మోపూరులో సరస్వతీదేవిగా పర్వతవర్ధిని



సంగంలో సరస్వతీదేవిగా కామాక్షిదేవి

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

కలిగిరి: కలిగిరి సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ కదిరి వెంకటరంగారావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులకు ఉచితంగా బస్తాలు ఇవ్వడంతో పాటు కూలీలు, రవాణా చార్జీలను సైతం అందజేస్తోందని తెలిపారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో పుట్టి ధాన్యానికి రూ.20,136 చెల్లిస్తున్నట్లు తెలిపారు.ఖరీఫ్ ధాన్యానికి బహిరంగ మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేనందున, కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవాలని కోరారు. సొసైటీ సీఈఓ మేకల రమణయ్య, డైరెక్టర్లు కోడూరు నాగిరెడ్డి, గని శ్రీనివాసులు, సిబ్బంది శ్రీనివాసరెడ్డి, రాధిక పాల్గొన్నారు.



కలిగిరిలో ప్రారంభిస్తున్న వెంకట రంగారావు

బయోగ్యాస్ ప్లాంట్లకు భూములను ఇవ్వొద్దు

కొండాపురం: తమ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములను బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ఇవ్వొద్దని సత్యవోలు పంచాయతీ ప్రజలు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సురేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనంబర్ 412లోని సుమారు 220 ఎకరాలు ప్రభుత్వ భూమిని బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటుకు కేటాయిస్తున్నట్లుగా రెవెన్యూ అధికారులు చెబుతున్నారన్నారు. ఈ భూములను తాము సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు భూమిని కేటాయిస్తే జీవనోపాధి కోల్పోతామని వాపోయారు.

రెండు కార్లు ఢీ



దెబ్బతిన్న కార్లు

సంగం: సంగం కొండ కూడలి వద్ద నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆత్మకూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు స్పీడ్ బ్రేకర్ వద్ద స్లో చేయగానే వెనుకగా వేగంగా వస్తున్న మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతినగా అందులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఇన్‌చార్జి ఎస్సై సైదులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేపట్టారు. సంగం మండల పరిధిలో జాతీయ రహదారిపై నిత్యం ఏదోక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనచోదకులు హడలిపోతున్నారు. జాతీయ రహదారి అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

డిజిటల్ బుక్‌తో కార్యకర్తలకు భరోసా



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దుత్తలూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు పెరిగాయని, పార్టీ కార్యకర్తలకు అండగా ఉండి భరోసా కల్పించేందుకే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు దుత్తలూరులోని జేఎస్సార్ ఫౌండేషన్‌లో దుత్తలూరు మండలాధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ కూటమి ఆరాచకాలను ఎదుర్కొనే విధంగా, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, ప్రజలకు భవిష్యత్తుపై నమ్మకం కలిగించే విధంగా డిజిటల్ బుక్ యాప్‌ను వైఎస్సార్‌సీపీ తీసుకొచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో రాష్ట్రంలో విధ్వంసపాలన సాగిస్తోందన్నారు. ప్రభుత్వ అరాచకాలపై ఎవరైనా ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి జైల్లో పెడుతోందన్నారు. అధికారులను అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను బెదిరించడమే కాకుండా అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. అక్రమమ కేసుల వివరాలను బాధితులు డిజిటల్‌బుక్‌లో నమోదు చేస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అధికార పార్టీ అండ చూసుకుని చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారులపైన కూడా వైసీపీ అధికారంలోకి రాగానే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కూటమిపాలనలో ఇబ్బంది పడుతున్న ప్రతిఒక్కరూ డిజిటల్ బుక్‌ను వినియోగించుకుని తమ సమస్యను ఆధారాలతో సహా పొందుపరచాలని సూచించారు. ఉదయగిరి జెడ్పీటీసీ ఎం రామాంజనేయులు, పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ కండ్లగుంట వెంకటరెడ్డి, మండలాల అధ్యక్షులు మందలపు తిరుపతి నాయుడు, కాటం రవీంద్రారెడ్డి, రేవనూరు శ్రీనివాసులు రెడ్డి, ఇస్కా మదన్‌మోహన్, కొండా రాజగోపాల్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు అలీఅహ్మద్, అక్కి భాస్కర్‌రెడ్డి, దస్తగిరి అహ్మద్, షంషీర్, బయ్యపురెడ్డి విజయ్, దేవరపల్లి మధుసూదన్‌రెడ్డి, మాగంటి శ్రీనివాసులు, దేవరపల్లి రఘురామిరెడ్డి, గురవయ్య, దేవరపాటి సురేంద్ర, కంభం వినయ్, పెంచల ప్రసాద్, బీటెక్ రవి తదితరులు పాల్గొన్నారు.

భూములకు హద్దులు చూపాలని వినతి



అనుమసముద్రంపేట: తమ భూములకు హద్దులు చూపించాలని గుడిపాడు గ్రామానికి చెందిన రైతులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి చెందిన 8 మంది రైతులు 1995లో సర్వే నంబర్ 268లోని 16.45 ఎకరాల మెట్టను కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నారని తెలిపారు. పట్టాలు సైతం పక్కాగా ఉన్నాయన్నారు. ఈ భూములు తన వేనని పక్కన పొలం కలిగిన టీడీపీ నాయకుడు దేవరాల హజరత్తయ్య కబ్జాకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. 2011లోనే తమ పేరుతో భూములు రిజిస్ట్రేషన్ అయ్యాయని రైతులను బెదిరిస్తున్నాడని విన్నవించారు. రెవెన్యూ అధికారులు స్పందించి తమ భూములకు హద్దులు చూపించాలని వారు కోరారు.

మంచినీటి పథకాల నిర్వహణకు చర్యలు



దుత్తలూరులో పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేపడుతున్న దృశ్యం



నందిపాడులో మంచినీటి పథకం వద్ద బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

దుత్తలూరు: మండలంలోని మంచినీటి పథకాల నిర్వహణపై 'సాక్షి'లో 'పర్యవేక్షణ లోపం-తాగు నీరు కలుషితం' అనే శీర్షికతో సోమవారం ప్రచురితమైన కథనంపై జిల్లా పంచాయతీ అధికారి స్పందించారు. మండలాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే నిర్వహణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున ఆధ్వర్యంలో నందిపాడుతో పాటు దుత్తలూరు పంచాయతీ పరిధిలోని చింతలగుంటలోని మంచినీటి పథకం వద్ద బ్లీచింగ్ చల్లించి శుభ్రత చర్యలు చేపట్టారు. అలాగే నర్రవాడ ఎస్సీ కాలనీతో పాటు దుత్తలూరు సెంటర్ సమీపంలోని పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనంతసాగరం పీహెచ్‌సీ తనిఖీ



సోమశిల: అనంతసాగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి సోమవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని అన్ని విభాగాలను పరిశీలించి వైద్యసిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలో వంద రోజుల టీబీ ముక్త్ కార్యక్రమం అమలు తీరును వైద్యులను అడిగి తెలుసుకున్నారు. టీబీ కేసుల వివరాలను పరిశీలించారు. అనంతరం రేవూరు, మినగల్లు విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను తనిఖీ చేశారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యులు శ్రీకాంత్, శ్రావణి, అశోక్, ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మర్రిపాడు: మండలంలోని ఏపిలగుంట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..ఏపిలగుంటకు చెందిన గజరాజు ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపుతప్పి కిందపడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు గజరాజును 108 వాహనంలో ఉదయగిరి ఆస్పత్రికి తరలించారు.

ఆక్వా రైతులకు సబ్సిడీపై విద్యుత్

కావలి(అల్లూరు): ఆక్వా సాగుచేస్తే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీని ప్రకటించిందని కావలి మత్స్యశాఖ అభివృద్ధి అధికారి లక్ష్మానాయక్ సోమవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం కింద లైసెన్సులు పొందిన రైతులకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున సబ్సిడీ ఇస్తుందన్నారు. ఆక్వా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పీడ్ పోస్ట్ చార్జీల పెంపు

ఆత్మకూరురూరల్: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అక్టోబరు 1 నుంచి స్పీడ్‌పోస్ట్ చార్జీలను పెంచుతున్నట్లు ఆత్మకూరు పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఏఎస్‌పీ అహమ్మద్ హుస్సేన్ సోమవారం తెలిపారు. 50 గ్రాములకు స్థానికంగా రూ.19, 200కి.మీ.పైన రూ.47 చార్జీ చేయనున్నట్లు చెప్పారు. అలాగే 51 నుంచి 200 గ్రాముల వరకు స్థానికంగా రూ.24, దూరప్రాంతాలకు 200 కి.మీ.వరకు రూ.59, 200- 500కి.మీ వరకు రూ.63, 501-1000 కి.మీ వరకు రూ.68, 1001-2000 కి.మీ. వరకు రూ.72, 2000కి.మీపైన రూ.77 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే 251-500 గ్రాముల వరకు స్థానికంగా రూ.28, ఇతర ప్రాంతాలకు 200 కి.మీ వరకు రూ.70, 201-500కి.మీ వరకు రూ.75, 501-1000 కి.మీ. వరకు రూ.82, 1001-2000 కి.మీ. వరకు రూ.88, 2వేల కిలోమీటర్లపైన రూ.93కు పెంచినట్లు వివరించారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

కావలి(అల్లూరు): మున్సిపాలిటీలో దినసరి వేతనంపై పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ పట్టణాధ్యక్షుడు తిరుపాలు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌కు కార్మికులతో కలిసి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. పెరిగిన ధరలతో కుటుంబాలు గడవక వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులను పర్మినెంట్ చేసి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు.

భూ పరిహారం కోసం వినతి

వింజమూరు(ఉదయగిరి): నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణానికి సేకరించిన భూములకు సంబంధించిన పరిహారాన్ని అందించాలని కోరుతూ వింజమూరుకు చెందిన పలువురు రైతులు నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జేసీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన జేసీ త్వరలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు.